
ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ

రాయచూరు, జూన్ 3 : జిల్లాలోని సింధనూరు తాలూకా విరుపాపూర గ్రామంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఆదివారం రాత్రి ఒకే గ్రామంలో ఐదు చోట్ల చోరీకి పాల్పడ్డారు. మూడు ఇళ్లు, ప్రైవేటు ఆస్పత్రి మరో కిరాణం దుకాణంలో చోరీ చేశారు. ఐదు చోట్ల 30 తులాల బంగారం, వెండి ఆభరణాలు, 1.63 లక్షల నగదు చోరీకి గురైంది. అడిషనల్ ఎస్పీ డి. హరీశ్ మైత్రి, డీఎస్పీ బీఎస్ తళవార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సునిల్ తదితర పోలీస్ అధికారు లు గ్రామాన్ని సందర్శించి దొంగతనం జరిగిన ఇళ్లు, దుకాణం, ప్రైవేటు ఆస్పత్రిని సోమవారం పరిశీలించారు. వరుస చోరీలతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

సర్వత్రా ఉత్కంఠ





- అందరిచూపు లోక్‌సభ ఫలితాలపైనే
- రాజకీయ మార్పులకు అవకాశం
- కాంగ్రెస్, బీజేపీలో గుసగుసలు

ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిన లోక్‌సభ ఫలితాలు.. మరోవైపు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాలు.. ఈ రెండింటిపైనా కర్ణాటకలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయని భావిస్తోంది. మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాతో గత ఎన్నికల మాదిరిగానే భారీ సంఖ్యలో లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుంటామని, మోదీ మూడోసారి ప్రధాని కావడం తథ్యమని బీజేపీ అంచనాలు వేస్తోంది. పైగా ఎగ్జిట్‌పోల్స్ అన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని ధీమాతో ఉంది. మరోవైపు కర్ణాటకలో అత్యధికంగా నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ వాసులు ఈసారి ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై ఎడతెగని ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఏమాత్రం తగ్గనిరీతిలో ఇక్కడ నిరసనలు, ఆందోళనలు కొనసాగించారు. వారంతా వేలాది రూపాయలు ఖర్చుచేసుకుని సొంతూళ్లకు వెళ్లి ఓటువేసి వచ్చారు. క్షణమొక యుగంలా ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు.

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలందరి చూపు మరికొన్ని గంటల్లో తేలిపోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపైనే ఉంది. రాష్ట్రంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా ఏప్రిల్ 26న 14 స్థానాలకు, మే 7న మరో 14 స్థానాలకు పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రక్రియ ముగిసి నెలరోజుల తర్వాత వస్తున్న ఫలితాలు ఎలా ఉంటాయో అనే ఆసక్తి నెలకొంది. కర్ణాటక లోక్‌సభ స్థానాలపై జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ 25 స్థానాల్లో గెలుపొందగా కాంగ్రెస్, జేడీఎస్ చెరోస్థానంలో మాత్రమే విజయం సాధించాయి. మండ్య నుంచి సుమలత ఇండిపెండెంట్‌గా గెలపొంది.. ఏడాది కాలంగా బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. అప్పట్లో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతున్నా బీజేపీ తిరుగులేని స్థానాలు సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకుంది. జేడీఎస్ 3 స్థానాల్లో పోటీ చేయగా బీజేపీ మిగిలిన 25 చోట్ల అభ్యర్థులను నిలిపింది. ఏడాది కిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లో 135 ఎమ్మెల్యేలను సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ అదే ఉత్సాహంతో లోక్‌సభలోనూ సాధ్యమవుతుందని భావించింది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు కేటాయించే విషయంలోనే దారి తప్పిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఏడుగురు మంత్రులు రామలింగారెడ్డి, లక్ష్మీ హెబ్బాళ్కర్, శివానంద పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, సతీశ్‌జార్కిహోళి, మహదేవప్ప వారి పిల్లలకే టిక్కెట్లు సాధించుకున్నారు. ఇది అంతర్గతంగా తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇక డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మరోసారి తమ్ముడికి టిక్కెట్ పొందగా మంత్రి మధుబంగారప్ప అక్క గీతకు, దావణగెరె నుంచి మంత్రి మల్లికార్జున భార్య ప్రతిభను బరిలోకి దించారు. రాజకీయ పదవులన్నీ వీరి కుటుంబాలకేనా అనే విమర్శలు వచ్చాయి. జేడీఎస్ పోటీ చేసింది మూడు స్థానాల్లోనే అయినా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి మండ్య నుంచి, ఆయన అన్న రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ హాసన్ నుంచి, కోలారు నుంచి పార్టీ సీనియర్ కార్యకర్తకు టిక్కెట్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పది స్థానాల్లో వారసత్వ ముద్రతో చెడ్డపేరు మోసుకుంది. బీజేపీ సిట్టింగ్‌లను సైతం పక్కనపెట్టి వ్యూహాత్మకంగా పలువురు ప్రముఖులను రంగంలోకి దించింది. బెంగళూరు గ్రామీణ నుంచి పద్మశ్రీ గ్రహీత, హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు, మైసూరు నుంచి రాజ కుటుంబానికి చెందిన యువరాజు యదువీర్‌కు, దక్షిణకన్నడ నుంచి కెప్టెన్ బ్రిజేశ్‌చౌటకు, కొప్పళ నుంచి పేరొందిన ఆర్థో వైద్యుడు బసవరాజ్ క్యావటూర్‌కు టిక్కెట్ కేటాయించారు. ఆరు సార్లు గెలుపొందిన అనంతకుమార్ హెగ్డేకు చెక్ పెట్టారు. ఇలా వినూత్నంగా టిక్కెట్లు ఇవ్వడం పార్టీకి కలసి వచ్చినట్టయ్యింది. మరోవైపు గడిచిన నాలుగు విడతల లోక్‌సభ ఎన్నికల్లో దక్కిన ఆదరణే మరోసారి లభిస్తుందని ఫలితాలకు ముందే ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సింగిల్‌డిజిట్ దాటదని పలు సర్వేలు తేల్చాయి. మరోవైపు అధికార కాంగ్రెస్‌లో ఫలితాలు పెను పరిణామాలకు దారితీస్తాయనే చర్చ జోరందుకుంది. పిల్లలకు టిక్కెట్లు దక్కించుకుని ఓటమి చెందితే మంత్రి పదవులు వదులుకోవాలనే పార్టీ నిర్ణయానికి కట్టుబడితే రాజకీయ సంక్షోభం కలిగినా ఆశ్చర్యం లేదనిపిస్తోంది. మరోవైపు నాయకత్వ మార్పు అంశం కూడా హల్‌చల్ చేస్తోంది. బీజేపీలో తక్కువ సీట్లు వస్తే పార్టీ అధ్యక్ష పదవి నుంచి విజయేంద్రకు ముప్పు ఉందనే ప్రచారం సాగినా ఎగ్జిట్‌పోల్స్‌తో యడియూరప్ప కుటుంబానికి ఎదురే లేదనే సంకేతాలు వచ్చాయి. మరికొన్ని గంటల్లో తేలిపోయే ఫలితాలకోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ పకడ్బందీగా చర్యలు తీసుకుంది. భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

హాసన్ ఫలితంపై ఆసక్తి

హాసన్ నుంచి పోటీ చేసిన ప్రజ్వల్ గెలుస్తారా... లేదా..? అనేది మరో చర్చనీయాంశంగా ఉంది. రాసలీలల పెన్‌డ్రైవ్‌లు బహిర్గతం కాగానే జర్మనీకి వెళ్లిపోయిన ప్రజ్వల్‌పై కేసులు నమోదు కావడం, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అతడి రాసలీలల అంశం వివాదమైంది. 34 రోజుల తర్వాత భారత్‌కు వెనుతిరిగి వచ్చి సిట్ అధికారుల కస్టడీలో ఉన్నాడు. ఇలాంటి క్లిష్టమైన సమయంలో అతడి ఎన్నిక ఎటువంటి ఫలితం ఇవ్వనుందో అనేది ఆసక్తికరంగా మారింది.

ఏపీ ఫలితాల కోసం ప్రవాసాంధ్రుల ఎదురుచూపు

- ఏడాదిగా కసరత్తు
- ఫలించిన నియోజకవర్గాల సమావేశాలు
- రూ.వేలు ఖర్చు చేసి సొంతూళ్లలో ఓటు హక్కు వినియోగం

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాల కోసం ప్రవాసాంధ్రులు ఎదురుచూస్తున్నారు. కర్ణాటకలో తెలుగువారు అత్యధికంగా ఉంటున్నారు. ప్రత్యేకించి బెంగళూరు నగరంలోనే 3-4లక్షలమందికిపైగా ప్రవాసాంధ్రులు ఉన్నట్టు సమాచారం. ఇలా లక్షలాదిమంది సొంతూళ్లకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారంతా మరికొన్ని గంటల్లో తేలిపోయే రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఫలితాల కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా శాసనసభ ఎన్నికలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రపంచదేశాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ తరహాలోనే ఏపీ ఎన్నికల ఫలితాలపైనా ఆసక్తి చూపుతున్నారు. ఒడిశా ఎన్నికల ప్రభావంతో పోలిస్తే ఏపీ ఎన్నికల ఫలితాలపై దేశ విదేశాల్లోనూ చర్చనీయాంశమే కాకుండా భారీగా బెట్టింగులు సాగుతున్నాయి. ఏపీ ఎన్నికలపై కర్ణాటకలోనూ భారీగా బెట్టింగ్‌లు జరిగినట్టు సమాచారం.

కన్నడిగులతో సత్సంబంధాలు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు ఇరుగుపొరుగు రాష్ట్రాలు. ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధాలు బహుశా దేశంలో ఏ రెండు రాష్ట్రాలకు ఉండవనే అభిప్రాయాలు ఉన్నాయి. దశాబ్దాల కాలంగా రెండు రాష్ట్రాల మధ్య భాష, వ్యాపారాలు, వాణిజ్య వ్యవహారాలు, విద్య, రాజకీయాలే కాకుండా జలవనరుల విభాగంలోనూ సంబంధాలు ఉన్నాయి. పైగా కర్ణాటక రాజధాని బెంగళూరు ప్రపంచంలోని ఎక్కడవారైనా జీవించేందుకు అనుకూలమైన నగరంగా పేరొందింది. ఇలా పొరుగు రాష్ట్రంలోనే సకల సౌలభ్యాలు ఉండడంతో విద్య, వ్యాపారం, హోటల్, నిర్మాణరంగం, రియల్ ఎస్టేట్‌తోపాటు పరిశ్రమల విభాగంలో వేలాదిమంది స్థిరపడ్డారు. ఇటీవల రెండు దశాబ్దాలలో ఐటీ రంగం ప్రపంచానికే తలమానికం అనేలా దూసుకుపోయింది. ఐటీ రంగంలో తెలుగువారికి కొదవలేదు. ఐటీబీటీ కార్పొరేట్ రంగాలలో బెంగళూరులో నివసించేవారు లక్షలాది మంది ఉన్నారు.

ఫలించిన నియోజకవర్గాల సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై బెంగళూరులో ఏడాదిగా కసరత్తు సాగింది. తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా బెంగళూరు టీడీపీ ఫోరం ఏర్పడి దశాబ్దకాలమైనా గత ఏడాదిగా వారి వ్యూహం పార్టీ రాష్ట్ర కమిటీనే ఆలోచన కలిగించేలా చేసింది. బెంగళూరులో ప్రాంతాలవారీగా నివసించే ప్రవాసాంధ్రులను గుర్తించారు. వారు ఏ నియోజకవర్గ పరిధిలోకి చేరుతారో జాబితాను సిద్ధం చేశారు. ఈ కసరత్తు సాగిస్తుండగానే పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలు జాబితా రూపకల్పనకు మరింత సహకరించినట్టయ్యింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును అరెస్టు చేయడంతో బెంగళూరులో నివసించే తెలుగువారిలో ఆవేశం, ఆగ్రహం పెల్లుబికింది. ఆంధ్రప్రదేశ్‌కు ఏమాత్రం తగ్గకుండా ఎక్కువ రోజులు వినూత్న రీతిలో బెంగళూరులో నిత్యం ఆందోళనలు కొనసాగాయి. ప్రతిరోజూ 10-15 ప్రాంతాల్లో నిరసనలు, చంద్రబాబుకు మద్దతు ర్యాలీలు చేశారు. యలహంకలోని చేనేత కార్మికుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మరోవైపు బళ్లారి, కొప్పళ, రాయచూరు జిల్లాల్లోనూ ప్రవాసాంధ్రులు భారీగా మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంలోనే తెలుగువారందరినీ సమీకరించి నియోజకవర్గాల వారిగా బీటీఎఫ్ ప్రతినిధులు ఆరా తీశారు. ఇందుకోసం బెంగళూరులోనే ఓ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. నిరంతరంగా ఓటరు జాబితాలను పరిశీలించారు. చంద్రబాబు జైలునుంచి విడుదల కావడంతో విజయోత్సవాలు చేశారు. చంద్రబాబును బెంగళూరుకు పిలిపించి వేలాదిమందితో భారీ సభ నిర్వహించారు. ఏపీ నుంచి అన్ని జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు భాగస్వామ్యులయ్యారు. అభ్యర్థులను ప్రకటించడంతో నియోజకవర్గాల వారీగా సభలు జరిపి సొంతూరుకు రండి ఓటు వేయండి, మీ బంధుమిత్రులతో మద్దతు ఇప్పించండి అనే ప్రచారం మరింత ఆకట్టుకుంది. ఇలా పోలింగ్‌కు వేలాదిరూపాయలు ఖర్చు చేసుకుని లక్షలాది మంది బెంగళూరు నుంచి సొంతూళ్లకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇలా లక్షలాదిమంది ఆంధ్రప్రదేశ్ ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

మంత్రి నాగేంద్ర రాజీనామా కోరలేదు

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- మంత్రి సూచనతోనే నగదు బదిలీ
- సిట్ ముందు అధికారులు



మీడియాతో సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై సిట్ విచారణ జరుపుతోందని, మంత్రి నాగేంద్ర రాజీనామా కోరలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. సోమవారం విధానసౌధలో ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌లో పాల్గొన్న అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ మంత్రి నాగేంద్ర ఏకంగా ముఖ్యమంత్రిని బెదిరించారనేది అవాస్తవమన్నారు. ఎవరు... ఎవరినీ బెదిరించలేదని అన్నారు. ప్రాథమిక నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.94.73 కోట్ల అవినీతిపై విచారిస్తున్న సిట్ అధికారులు కార్పొరేషన్ మాజీ ఎండీ జేజీ పద్మనాభ, అకౌంటెంట్ పరశురామన్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సిట్ విచారణ వేళ మంత్రి నాగేంద్ర సూచనతోనే కార్పొరేషన్ గ్రాంట్లను వివిధ ఖాతాలకు బదిలీ చేశామని మాజీ ఎండీ పద్మనాభ వివరించినట్టు తెలుస్తోంది. ఇదే సమాచారం సీఎంకు చేరడంతో ఆదివారం రాత్రి సీనియర్ మంత్రులతో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. లెజిస్లేచర్ భేటీ తర్వాత కొందరు మంత్రులతో సీఎం చర్చించినట్టు తెలుస్తోంది. మంత్రి నాగేంద్ర పేరు సిట్ ముందు ప్రస్తావన రావడంతో ఆయన రాజీనామా చేయడం సమంజసమని సీఎం కూడా అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. వీటన్నింటి నేపథ్యంలో ఏక్షణంలోనైనా మంత్రి నాగేంద్ర రాజీనామా చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- 3 ఉపాధ్యాయ, 3 పట్టభద్రుల స్థానాలకు పోలింగ్



మల్లేశ్వరంలో ఓటు వేసిన మాజీ మంత్రి అశ్వత్థనారాయణ



మల్లేశ్వరంలో ఓటు వేసిన పట్టభద్రులు



కనకపురలో ఓటేసిన డీసీఎం డీకే శివకుమార్



క్యూలో వేచి ఉన్న ఓటర్లు



బ్యాటరాయనపురలో ఓటు వేసిన బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్



తొలిసారి ఓటు వేస్తున్న పట్టభద్రురాలు

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విధాన పరిషత్‌లోని 3 ఉపాధ్యాయ, 3 పట్టభద్రుల స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టభద్రుల స్థానాలకు పోలింగ్ శాతం ఉదయం నుంచే మందకొడిగా సాగింది. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 88.07 శాతం పోలింగ్ నమోదైంది. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గంలో 82.56 శాతం, ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 95.27శాతం పోలింగ్ నమోదైంది. ఈశాన్య పట్టభద్రుల స్థానంలో 69.51శాతం, నైరుతి పట్టభద్రుల స్థానంలో 78.19, బెంగళూరు పట్టభద్రుల స్థానంలో 65.86 శాతం నమోదైంది. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం ఆశాజనకంగా సాగింది. కాగా ఎమ్మెల్యేల కోటా నుంచి 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో 12మంది దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, జేడీఎస్ నుంచి ఒకరు నామినేషన్ వేయగా కాంగ్రెస్ నుంచి పార్టీ ప్రకటించకపోయినా అసిఫ్ పాషా నామినేషన్ వేశారు.

వరుణుడి దెబ్బకు తల్లడిల్లిన ఐటీ నగరి

- ఒకే రోజు 110 మి.మీ. వర్షం
- బెంగళూరులో 133 సంవత్సరాల రికార్డు బద్దలు





కిర్లోస్కర్ లే అవుట్‌లో కుప్పకూలిన చెట్టు

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రారంభం రోజే వరుణుడు తన ప్రతాపం చూపాడు. ఆదివారం ఐటీ నగరి తల్లడిల్లింది. బెంగళూరులో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేదాకా కురిసిన వానకు రోడ్లు నదులను తలపించాయి. 133 ఏళ్ల రికార్డును అధిగమించేలా 110.3 మిల్లీ మీటర్ల వర్షం కొన్ని గంటల్లోనే కురిసింది. ఇది 133 సంవత్సరాల రికార్డుగా నిలిచింది. నగరంలో శని, ఆదివారాలతో కలిపితే 140.7 మి.మీ. వర్షం కురిసింది. 1891 జూన్ 16న 101.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. నగరంలోని వందలకొద్దీ చెట్లు నేలకొరిగాయి. 261కు పైగా విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డంతో కరెంటు సరఫరాలో అంతరాయం పెను ప్రభావం చూపింది. ఇళ్లు, కార్లు, ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి రెండు మూడు అడుగుల నీరు చేరింది. ప్రతి చోటా ముందస్తు జాగ్రత్తలు పాటించారు. రాత్రంతా బీబీఎంపీ అధికారులు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగించాయి. ప్రతిష్ఠాత్మకమైన లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌లలోనూ చెట్లు నేలకొరిగాయి. సోమవారం సాయంత్రం దాకా చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌స్తంభాల పునరుద్ధరణ కార్యాచరణ కొనసాగింది. నైరుతి రుతుపవనాలు ప్రారంభంలోనే భారీ వర్షం నమోదయింది. ఈనెల 5వ తేదీ వరకు భారీ వర్షం కురవనుందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. వర్షం ధాటికి రోడ్లు చెరువులుగా మారిపోయాయి.




హనుమంతనగర్‌లో కారుపై కూలిన చెట్టు



చెన్నమ్మ అచ్చుకట్టు కెరె ప్రాంతంలో కుప్పకూలిన భారీ వృక్షం



చెట్టు కొమ్మలు తొలగిస్తున్న బీబీఎంపీ సిబ్బంది


తుంగభద్రనదికి పెరిగిన ఇన్‌ఫ్లో

విజయనగరం జిల్లాలో వరుణుడి ఉగ్రరూపం

● హొస్పేటలో 8.6సెం.మీ. ● నీట మునిగిన పలు ప్రాంతాలు

బళ్లారి సిటీ,జూన్ 3: హొసపేట నగరంతో పాటు విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి జోరువాన కురిసింది. హొస్పేట్ టూరిస్ట్ టెంపుల్ సమీపంలో 8.64సెంమీ వర్షం కురిసింది. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం తెల్లవారుజాము వరకు కురిసింది. నగరంలోని 18వ వార్డులో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇందిరా నగర్ ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని హంపసాగర్‌లో 6.04సెంమీ. వర్షం కురిసింది.

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయంలో సోమవారం 710క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో నమోదైంది. దాదాపు నాలుగు నెలల పాటు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. రెండు రోజుల నుంచి తుంగభద్ర జలాశయ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో మొదలైంది. ఆదివారం 360 క్యూసెక్కుల నీరు ఉండేది. సోమవారం 710కి చేరింది. తుంగభద్రకు నీటి రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● విజయనగరం జిల్లాలోని కూడ్లిగి తాలూకా కానహొసళ్ళి , ఆలూరు రహదారి కొట్టుకుపోయింది. ఈ రహదారి గోతులమయమయ్యింది. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో జోరు వాన కురిసింది.

● బళ్లారి జిల్లా సండూర్‌లో మంచి వర్షం కురిసింది. ఎండిపోయిన వాగుల్లోకి నీరు చేరుతోంది. సండూర్‌లోని జీవజాల నారి హళ్ళ రిజర్వాయర్‌లోకి నీరు చేరుతోంది. వర్షాల రాకతో ఎండిపోయిన సండూర్ కొండల్లోని చెట్లు ఆకులు కొత్తగా చిగురించాయి. వర్షం రాకతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు.


సండూరు తాలూకాలోని నారిహళ్ల జలాశయంలో జలకళ

ముంచేసింది..!

బళ్లారి, విజయనగరం జిల్లాల్లో ఆదివారం వర్షం దంచి కొట్టింది. పలు జలాశయాలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లలోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వరుణుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వేదవతిలోకి చేరుతున్న వరద

బళ్లారిరూరల్ : జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జోరు వాన కురిసింది. హగరితో పాటు అనంతపురం జిల్లాలోని కణేకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, బొమ్మనహాళ్ తదితర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో వేదవతి నదికి భారీగా వరద చేరింది. నది నిండుకుండలా ప్రవహిస్తోంది. ముందస్తు వర్షాలతో అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షానికి కొట్టుకుపోయిన వంతెన

తోరణగల్లు : తాలూకా వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. భారీ వర్షానికి వంతెన కొట్టుకుపోయింది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో తోరణగల్లు ఓబుళిలోని విట్లాపుర గ్రామ పంచాయతీ, తిమ్మలాపురం ప్రక్కన ఉన్న వంతెన కొట్టుకుపోయింది. వంతెన లేకపోవడంతో వాహనదారులకు పాఠశాలలకు విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. వంతెన త్వరగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షం తగ్గిన తర్వాత అధికారులతో చర్చించి వంతెన నిర్మిస్తామని పీడబ్ల్యూడీ ఏఈఈ కృష్ణనాయక్ తెలిపారు.

వర్షంతో దెబ్బతిన్న ఇళ్లు

తాలుకాలో మధ్యరాత్రి కురిసిన భారీ వర్షాలతో చుండూరు, చోర్నూరు, హుబ్లి, సండూరు, హొవళి, తోరణగల్లు ప్రాంతంలో 20 కి పైగా కరెంటు స్తంభాలు విద్యుత్ తీగలు తెగిపోయాయి. అలాగే అంకమనల్ గ్రామంలో చిన్నయ్య ఇల్లు దెబ్బతింది. తారానగర్‌లోని దొడ్డనగౌడ ఇంటి గోడలు దెబ్బతిన్నాయి. తోరణగల్లు హుబలిలోని ఉబ్బలగండి గ్రామంలోని యంకమ్మ ఇంటి గోడలు దెబ్బతిన్నాయి. యు రాజాపురం గ్రామంలోని ఇంటి గోడలు దెబ్బతిన్నాయి. సండూరు తాలుకాలో సండూరులో 67.1 మిల్లీమీటర్లు, చోర్నూరు 66 మిల్లీమీటర్లు, తోరణగల్లులో 70 మిల్లీమీటర్లు, విఠలాపురం 99.2 మిల్లీమీటర్ వర్షపాతం నమోదైంది.


భారీ వర్షంతో కొట్టుకుపోయిన వంతెన

అండర్ ఫెయిల్..!

● రూ. కోట్ల ప్రజాధనం వృథా
● ఒక్కరోజు వర్షానికే మునిగిన అండర్ పాస్


సత్యనారాయణ పేట అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

బళ్లారి గాంధీనగర్, జూన్ 3: కాస్త వర్షం పడినా నగరవాసులకు జలకష్టాలు తప్పడం లేదు. బళ్లారి నగరాన్ని విభజించే సత్యనారాయణ పేట, దుర్గమ్మ గుడి అండర్ పాస్‌లో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాణ్యత లేని నిర్మాణాలతోనే వాన కష్టాలు తప్పడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అండర్‌పాస్ వాహనాలు వెళ్ళేందుకు ఫ్లై ఓవర్, క్రింద రైల్వే ట్రాక్, ఆ క్రింద వాహనాలు ప్రయాణించేలా అండర్‌పాస్ నిర్మించారు. వర్షా కాలంలో వర్షం వచ్చిందటే చాలు... అండర్‌పాస్‌లో అధిక ప్రమాణంలో నీరు నిలవడంతో వాహనాలు అన్ని ఫ్లైఓవర్‌పై వెళ్ళడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గత ఏడాది సత్యనారాయణ అండర్ పాస్‌కు శాస్వత పరిష్కారం కోసం రూ .2 కోట్లతో బెడ్ కాంక్రీట్ లైనింగ్ వేశారు. అయితే గత ఏడాది వర్షాలు అంతగా లేకపోవడంతో సమస్య కానరాలేదు. ఈ సారి అధిక వర్షాలతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బెడ్‌కాంక్రీట్ లైనింగ్ పనుల వలన అండర్‌పాస్‌లు సమస్య పరిష్కారం కాలేదు. నిధులు వృథా అయ్యాయే మినహా... సమస్యల పరిష్కారం కాలేదని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలయం కాగా, చాలా ప్రాంతాల్లో మురికి కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించంతో రోడ్లన్నీ బురదగా మారాయి. చెత్తను తొలగించక పోవడంతో కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగి రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున డ్రైనేజీల్లో పేరుకు పోయిన పూడిక తొలగించడంతో పాటు, సత్యనారాయణ పేట అండర్‌పాస్‌కు శాశ్వత పరిష్కారం లభించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




పోటెత్తిన వాగులు, వంకలు

కంప్లి : భారీ వర్షానికి కంప్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా వాగులు, వంకలు పోటెత్తాయి. ఆదివారం రాత్రి వర్షం దంచి కొట్టింది. ఈ ఏడాది ప్రారంభంలోనే వర్షాలు కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కురుగోడు తాలుకా పరిధిలోని ఛానాల్ వద్ద ఉప్పొంగి ప్రవహించడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. కగ్గల్లు వద్ద కూడా వర్షపునీటితో పొలాలు, వాగులు ఏకమయ్యాయి. ఈ భారీ వర్షానికి రోడ్లు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.


కగ్గల్లు వద్ద ఉధృతంగా పారుతున్న వాగు


ఇళ్లలోకి చేరిన నీటితో వృద్ధుల కష్టాలు ఇలా..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.59	1,580.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	637	1041
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	25	244
సామర్థ్యం (టీఎంసీలు)	3.41	4.88

హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

బళ్ళారి గాంధీనగర్, జూన్ 3: హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరగడం కలకలం రేపింది. విజయనగర జిల్లా, హగరిబొమ్మనహళ్ళి పట్టణంలో పోలీసు హెడ్ కానిస్టేబుల్ వివీష్ మేటి ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. పాతూరు ప్రాంతంలో సాయి లేఔట్‌లో నివాసం ఉంటున్న రవీష్ ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి రూ 3.92లక్షల విలువ చేసే 80గ్రాముల బంగారు ఆభరణాలు, 8వేల నగదు ఎత్తుకెళ్ళినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హగరిబొమ్మనహళ్ళి పిఎస్ఐ మానప్ప వాల్మీకి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రవీష్ తంబ్రళ్ళి పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

రైతు సంఘం నాయకుడి మృతి

కంప్లి, జూన్ 3 : కుడితిని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ పట్టణ పంచాయతీ అధ్యక్షులు రాజశేఖర్ తండ్రి, రైతు సంఘం నాయకులు విఠలాపుర తిమ్మప్ప (84) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతిపై పలువురు రైతు సంఘం నాయకులు సంతాపం తెలిపారు.


విఠలాపుర తిమ్మప్ప (ఫైల్)

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు




ఓటు హక్కు వినియోగించుకున్న స్వతంత్ర్య అభ్యర్థి నారా ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

బళ్లారి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈశాన్య కర్ణాటకలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం ఏడు జిల్లాల పరిధిలో వున్న 1,56,627 మంది ఓటర్లకు గాను 67 శాతం వున్నారు. ఇందులో మొత్తం 67.78 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. బళ్లారి జిల్లాలో 76.78, కలబురిగి జిల్లాలో 71.67, బీదర్‌లో 68.37, యాదగిరిలో 68.72 పోలింగ్ శాతం జరిగినట్లు తెలిపారు. ఈశాన్య పట్టభద్రుల రేసులో ముగ్గురు ప్రధానంగా పోటీపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రులు ఓటు వేసేందుకు క్యూ కట్టారు. కొన్ని చోట్ల త్వరగా పోలింగ్ ముగియగా, కొన్ని చోట్ల ఆలస్యంగా నడి చింది. బళ్లారి జిల్లాలోని కంప్లి, సిరుగుప్ప, బళ్లారి గ్రామీణ, బళ్లారి నగరం, సండూరు, విధానపరిషత్ క్షేత్రంలో ఉన్న ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సరళాదేవి కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే స్వతంత్ర్య అభ్యర్థి నారా ప్రతా ప్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగి లిన వారు. కలబురిగిలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.


కంప్లిలో క్యూలో ఉన్న ఓటరు


పోలింగ్ ఏజెంట్లతో డబ్బులు తీసుకుంటున్న ఉపాధ్యాయులు
డబ్బు లెక్కిస్తున్న ఓ ఉపాధ్యాయుడు

నోటిస్తేనే.. ఓటు..!

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు డిమాండ్ చేసిన ఉపాధ్యాయులు

పావగడ, జూన్ 3 : ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు మొండికేశారు. నోటు ఇస్తే తప్ప ఓటేసేది లేదని చెప్పడంతో పార్టీ నేతలు పోటాపోటీగా పంపిణీలే చేపట్టారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 55శాతం ఉపాధ్యాయులు చివరి క్షణం వరకు ఓటేయకుండా డబ్బుల కోసం పోట్లాడడం కనిపించింది. బీజేపీ వారు ఓటుకు రూ.5వేలు ఇస్తే కాంగ్రెస్ పార్టీవారు ఓటుకు రూ.7వేలు చొప్పున అధికమొత్తంలో ఇచ్చారని తెలుస్తోంది. అంతేకాకుండా మహిళా టీచర్లకు పట్టుచీర, రూ.2వేల వాచీ కూడా పంచిపెట్టారు. తాలూకా వ్యాప్తంగా 803ఓట్లు ఉండగా అందులో 764ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య రెట్టింపు పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకే 500కుపైగా ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది.

రేబిస్‌ను నిర్లక్ష్యం చేయొద్దు: డీహెచ్ఓ


అవగాహన కల్పిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, జూన్ 3: పెంపుడు కుక్కలు, వీధికుక్కలు కరిచినట్లయితే నిర్లక్ష్యం చేయరాదని, తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి రేబీస్ ఇంజక్షన్ వేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు సూచించారు. సోమవారం బళ్లారిలోని బండిహట్టి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని వట్టప్పచెరువు ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు రేబీస్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈసందర్బంగా అడ్మినిస్టేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యాస్మీనా,జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్ప నవర్, సిబ్బంది దానకుమారి , శారద, మహాలింగ, ఆశావర్కర్లు పార్వతీవ, బువనేశ్వరీ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బళ్లారి సిటీ,జూన్ 3: సాగకు సిద్ధమైన రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేసెందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసకుంటున్నారు. సోమవారం దుకాణాలను అధికారులను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 92విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి 71 విక్రయకేంద్రాలకు నోటీసులు జారీ చేశారు. విత్తనాలు,ఎరువులు, పురుగుమందుల నాణ్యత నియంత్రణ పరీక్ష కోసం నిబంధనల ప్రకారం వివిధ అనుబంధ దుకాణాల నుంచి 26 నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు తిరుమలేశ్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనిముట్లను అధీకృత విక్రేతల వద్ద కొనుగోలు చేసి తప్పని సరిగా రశీదులను పొందాలన్నారు. ఈసందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సిరుగుప్ప, జూన్ 3 : విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని విద్యాశాఖాధికారి గురప్ప సూచించారు. సోమవారం తాలుకాలోని షానవాజ్‌పురలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖుల,రెవెన్యూ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉలిగమ్మదేవిని దర్శించుకున్న శ్రీరాములు


పూజలు చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు

కంప్లి, జూన్ 3 : బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీరాములు కొప్పళ్ల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఉలిగమ్మదేవి ఆలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కేంద్రంలో బీజేపీ విజయం ఖాయమని, మరో సారి మోదీ ప్రధాని అవుతారన్నారు. బళ్లారి విజయనగర జిల్లాలో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు.

రైతులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం..

కంప్లి, జూన్ 3 : పరిశ్రమల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు సుమారు 536 రోజులుగా నిరసనలు చేపడుతున్నా అధికారుల్లో చలనం లేదని, ఇప్పటికైనా స్పందించ కపోతే బళ్లారి బంద్ చేపడ్తామని కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాజ్యా ఉపాధ్యక్షులు బసవరాజు హెచ్చరిం చారు. సోమవారం కుడితిని పట్టణంలో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల రైతులు భూములు కోల్పోయినా వారికి న్యాయం జరగలేదన్నారు. బెల్గామ్‌లో జరిగిన శీతాకాల సమావేశంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా న్యాయం జరగలేదన్నారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తిబాబు మాట్లాడుతూ జిల్లా, సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు ప్రతి రైతుకు రూ. 30 లక్షల ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగ్లిసాబ్, తిప్పేస్వామి, సంపత్, భావి శివకుమార్, తిమ్మప్ప, అరిగిణదోణి బసవన్న గౌడ, తిమ్మారెడ్డి, జడెప్ప, అంజినప్ప, సిద్ధప్ప, పాండు, కనకప్ప, నారాయణప్ప, సురేష్ గౌడ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దెయ్యం పేరుతో బాలికపై అత్యాచారం..!

బళ్ళారి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రార్థనా మందిరంలో బాలికకు దెయ్యం పట్టిందని, దెయ్యం విడవాలంటే లైంగిక కోరిక తీర్చాలంటూ నిర్వాహకుడు వేధించిన ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనలో ఇద్దరిని మహిళా పోలీసులు అరెస్టు చేశారు. మూడు సంవత్సరాల నుంచి బాలిక మందిరానికి వస్తున్నట్లు తెలుస్తోంది. దెయ్యం పేరుతో బెదిరించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని, ఫిర్యాదు మేరకు నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

ఘనంగా కరుణానిధి జయంతి


కరుణానిధి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

హోసూరు, జూన్ 3: డీఎంకే నేత, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఆదర్శప్రాయులని వక్తలు కొనియాడారు. కరుణానిధి 101వ జయంతి సందర్భంగా హోసూరులో సోమవారం కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు. మేయర్ సత్య అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ డీఎంకే అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా కరుణానిధి అందించిన సేవలను వివరించారు. రాజకీయాల్లోనే కాకుండా సాహిత్యంలోనూ రాణించారన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా సమితి ఛైర్మెన్ యువరాజ్, కోశాధికారి సుకుమారన్, ఉప కార్యదర్శి పుష్ప సర్వేష్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, రాష్ట్ర మైనారిటీల బృందం ఉప కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద

హోసూరు, జూన్ 3: కార్పొరేషన్‌లోని 4 వార్డులలో వీధికుక్కలు వీపరీతంగా సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులను వెంబడించి కాట్లు వేస్తున్నాయి. ప్రజలనుంచి ఫిర్యాదులు రావడంతో సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సంచరిస్తున్న వీధికుక్కలను హోసూరు కార్పొరేషన్ సిబ్బంది పట్టుకున్నారు. మగ కుక్కలను మాత్రమే వలవేసి పట్టుకుని తరలించారు. వాటికి స్టెరిలైట్ చేసి వదిలేస్తామని చెబుతున్నారు. ఎట్టకేలకు వీధికుక్కల బెడద నియంత్రణకు కార్పొరేషన్ స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా కౌంటింగ్ : కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), జూన్ 3: ఓట్ల లెక్కింపు పకడ్బందీగా చేపట్టాలని, లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు కొన్ని గంటలు ఉండగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కృష్ణగిరి కలెక్టర్ కె.ఎం. సరయు ప్రకటించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ తొలివిడతలోనే కృష్ణగిరి పార్లమెంటు నియోజకవర్గానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరిగిందన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలించామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కృష్ణగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని 14 టేబుళ్లు, 21 రౌండ్లలో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పెరుందురై, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ ఎన్నికల లెనిన్, జిల్లా ఎన్నికల అధికారి సంపత్, ప్రత్యేక జిల్లా అధికారి జైశంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సరయూ

మద్యం దుకాణాల బంద్

హోసూరు, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్, విధానపరిషత్ ఎన్నికల నేపథ్యంలో నాలుగు రోజులపాటు మద్యం విక్రయాలకు కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో సరిహద్దులోని అత్తిబెలె ప్రాంతంలో మద్యం దుకాణాలు మూసివేశారు. ఎన్నికల ఫలితాల వేళ అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా మద్యం విక్రయాలకు బ్రేక్ పెట్టడం సామాన్యంగా ఉంటోంది. ఈసారికూడా అదే విధానం పాటించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మూతబడ్డ మద్యం దుకాణాలు

తగ్గిన గుండుమల్లె ధర

హోసూరు, జూన్ 3: కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, బాగలూరు, తళి, అంచెట్టి, పోచ్చంపల్లి తదితర ప్రాంతాల్లో మల్లె పూలు సాగు చేస్తున్నారు. గుల్లంపట్టి, చందంపట్టి, నాయకంపట్టి, కె.పుత్తూరు పరిసర ప్రాంతాలల్లోని వేలాది ఎకరాల్లో గుండుమల్లి సాగు అవుతోంది. పూల పంటకు తెగులు సోకడంతో దిగుబడి తగ్గింది. పూల నాణ్యత తగ్గడంతో ధర కూడా తగ్గింది. ఇక్కడ పండించే గుండుమల్లె పూలు ఎక్కువగా బెంగళూరు పూలమార్కెట్‌కు ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం కిలో రూ.150-200 మాత్రమే పలుకుతోంది. పూలపంటకు పట్టిన తెగుళ్ల నివారణకు రూ.3-4వేల దాకా ఖర్చు అవుతోందని రైతులు అభిప్రాయపడ్డారు. సాధారణంగా వారానికి ఎకరాకు 300కిలోల పూలు దిగుబడి ఉండగా తెగుళ్ల కారణంగా 80-90కిలోలకు తగ్గిపోయిందని, రేటు కూడా తగ్గడంతో నష్టపోతున్నట్టు రైతులు వాపోతున్నారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (జయంతి)



ఎస్పీబీ, బాలుగా చిరపరిచితులైన గాన గంధర్వుడిగా పేరొందిన శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రమణ్యం 1946 జూన్ 4న నెల్లూరు జిల్లా కోనేటమ్మ గ్రామంలో జన్మించారు. తనదైన గాత్రంతో నేపథ్య గాయకుడిగా దశాబ్దాలపాటు శ్రోతలను రంజింపచేశారు. బుల్లితెర వ్యాఖ్యాత, సంగీత దర్శకుడు, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, సినీ నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 40వేలకుపైగా పాటలు పాడారు. ఉత్తమ నేపథ్య గాయకుడిగా 6 జాతీయ సినీ పురస్కారాలు, నంది అవార్డులు, ఎన్టీఆర్ నేషనల్ అవార్డు సహా 'పద్మశ్రీ' పురస్కారాలు అందుకున్నారు. 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

నూతన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నూతన్ సమర్థ్ బాహ్లా 1936 జూన్ 4న ముంబైలో మరాఠీ కుటుంబంలో జన్మించారు. హిందీ సినీ రంగంలో సుమారు నాలుగు దశాబ్దాలపాటు రాణించిన సుందరాంగి. ఉత్తమనటిగా ఐదుసార్లు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 14వ యేట 1950లో ఆమె తల్లి దర్శకత్వం వహించిన 'హమారి బేటీ' సినిమాతో తెరంగేట్రం చేశారు. సుజాత, మిలన్, అనారి, తేరే ఘర్‌కే సామ్నే, తదితర సినిమాలు ఎంతో గుర్తింపునిచ్చాయి. ఆమె కుమారుడు మోనిష్ బాహ్లా కూడా సినీ, బుల్లితెర నటుడు. ఆమె 1991 ఫిబ్రవరి 21న కన్నుమూశారు.

ఆరుద్ర (వర్ధంతి)



కళాప్రపూర్ణ గ్రహీత ఆరుద్ర 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. శ్రీశ్రీ తర్వాత అంతగా యువతరంపై ఎక్కువ ముద్ర పడిన అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకుడు, నాటకకర్త, విమర్శకుడు. సంగీతం, నాట్యంపై రచనలు ఆరుద్ర అభినివేశాన్ని పట్టి చూపిస్తాయి. కవి, పరిశోధకుడిగా నవ్యత కోసం పరితపించిన నిత్యశోధకుడు, హేతువాది. సుమారు 4వేల సినిమాపాటలు రాశాలు. 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' గ్రంథం ఎంతో సాహితీ పరిశోధకులకు ఉపయుక్తమైనది. 1998 జూన్ 4న కన్నుమూశారు.

అనిల్ అంబానీ (పుట్టినరోజు)



అనిల్ అంబానీ 1959 జూన్ 4న జన్మించారు. రిలయెన్స్ ఇండస్ట్రీస్ అధినేత ధీరూబాయి అంబానీ కుమారుడు. ప్రస్తుతం రిలయెన్స్ ఏడీఏ గ్రూప్‌కు ఛైర్మన్‌గా కొనసాగు తున్నారు. దేశంలో పేరొందిన రిలయెన్స్ కమ్యూనికేషన్స్, రిలయెన్స్ పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కేపిటల్ సంస్థలు ఏర్పాటు చేసి ఆయా రంగాలలో తనదైన ముద్ర చాటుకున్నారు. 2004-06 మధ్య ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. పారిశ్రామికవేత్తగా పలు పురస్కారాలు అందుకున్నారు.

ఏంజెలినా జోలి (పుట్టినరోజు)



ప్రముఖ అమెరికా నటి ఏంజెలినా జోలి 1975 జూన్ 4న జన్మించారు. సినీ దర్శకురాలిగానే కాక మాన వతావాదిగాను గుర్తింపు పొందారు. అకాడమీ అవార్డు, 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు అందుకున్నారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటీమణులలో ఒకరు. పలు నాటకాలు రచించి దర్శకత్వం వహించారు. అంతేకాక విద్య, మహిళా హక్కులు, తదితర అంశాలపై తన గళం వినిపిస్తారు.

ఎమ్మెల్సీ స్థానాలకు జోరుగా నామినేషన్లు

- ఒకేరోజు 11 మంది దాఖలు
- పాల్గొన్న సీఎం, డీసీఎం ఇతర ముఖ్యనేతలు
- సందడిగా విధానసౌధ



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటా నుంచి విధానపరిషత్ సభ్యుల ఎన్నిక కోసం నామినేషన్ల హోరు కొనసాగింది. 11 స్థానాలకు ఒకే రోజున అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం విధానసౌధలో శాసన సభ కార్యదర్శి, ఎన్నికల అధికారి ఎంకే విశాలాక్షికి నామినేషన్‌పత్రాలను సమర్పించారు. కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, జేడీఎస్ నుంచి ఒకరు నామినేషన్ వేశారు. యతీంద్ర సిద్దరామయ్య నామినేషన్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్ పాల్గొన్నారు. సీఎం రాజకీయ కార్యదర్శి, సిట్టింగ్ ఎమ్మెల్సీ గోవిందరాజు నామినేషన్‌లో సీఎం, డీసీఎంతోపాటు ప్రియాంక ఖర్గే పాల్గొన్నారు. ఐవాన్ డిసౌజా నామినేషన్‌లో అశోకపట్టణతోపాటు, బిల్కిస్ బానో నామినేషన్‌లో సీఎం, డీసీఎంతోపాటు మంత్రి రాజణ్ణ పాల్గొన్నారు. పరిషత్ సభానాయకుడు, మంత్రి బోసరాజు నామినేషన్‌లో సీఎం, డీసీఎంలతోపాటు మంత్రులు హెచ్‌కే పాటిల్, కేహెచ్ మునియప్ప, జగదీప్ గుత్తేదార్ నామినేషన్‌లో మంత్రి శరణప్రకాశ్‌పాటిల్, కల్యాణ కర్ణాటక అభివృద్ధి ప్రాధికార ఛైర్మన్ అజయ్‌సింగ్ పాల్గొన్నారు. వసంతకుమార్ నామినేషన్‌లో మంత్రి ఎంబీ పాటిల్ సహా పలువురు పాల్గొన్నారు. ఇక బీజేపీ అభ్యర్థులు సీటీ రవి నామినేషన్‌లో ప్రతిపక్షనేత అశోక్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రవికుమార్ నామినేషన్‌లో నేతలు అశోక్, విజయేంద్రతోపాటు పరిషత్ ప్రతిపక్షనేత కోట శ్రీనివాస పూజారి, కేంద్ర మాజీ మంత్రి సదానందగౌడ పాల్గొన్నారు. ఎంజీ మూలె నామినేషన్‌లో విజయేంద్రతోపాటు గోపాలయ్య, చలవాది నారాయణస్వామి పాల్గొన్నారు. జేడీఎస్ కోటాలో ఏకైక అభ్యర్థి జవరాయగౌడ నామినేషన్‌లో మాజీ సీఎం, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, జేడీఎస్ కోర్ కమిటీ ఛైర్మన్ జీటీ దేవెగౌడ సహా పలువురు పాల్గొన్నారు.



జేడీఎస్ అభ్యర్థి జవరాయగౌడ నామినేషన్



బీజేపీ అభ్యర్థి సీటీ రవి బీజేపీ అభ్యర్థి రవికుమార్



బీజేపీ అభ్యర్థి రవికుమార్, మూలె



కాంగ్రెస్ అభ్యర్థులు గోవిందరాజు, యతీంద్ర, బిల్కిస్ బానో, ఐవాన్ డిసౌజా, జగదేవ్‌గుత్తేదార్, బోసరాజు

ప్రశాంతంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



బొమ్మనహళ్ళిలో ఓటర్ల చీటీల పరిశీలన, విజయపురలో క్యూలో ఓటర్లు

బొమ్మనహళ్ళి, జూన్ 3: పరిషత్‌లో పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థి రామోజిగౌడ విజయం తథ్యమని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లోని జేఎస్ఎస్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం పోలింగ్ జరిగింది. 2340 మందికి గాను 1126మంది ఓటు వేశారు. పోలింగ్ అనంతరం హెచ్ఎస్ఆర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి నెలరోజులుగా ప్రచారం చేశామని గెలుపు ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరిగింది. బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రచార సమితి సభ్యుడు కే వాసు దేవ రెడ్డి, బొమ్మనహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర, బిలేకహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ, రాఘవేంద్ర, సర్దార్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయపురలో 68శాతం పోలింగ్

విజయపుర: పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ఉత్సాహంగా సాగాయి. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటైన కేంద్రంలో పట్టభద్రులు క్యూలో వేచియుండి ఓట్లు వేశారు. పట్టణంలోని రెండు బూత్‌లలోనూ 1522 మంది ఓటర్లకుగాను 1036మంది ఓట్లు వేయడం ద్వారా 68శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో 553మంది పురుషులు, 483మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ శివరాజ్ పరిశీలించారు.

చింతామణిలో 98శాతం పోలింగ్

చింతామణి: విధానపరిషత్‌లోని ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గ పరిధికి జరుగుతున్న ఎన్నికల్లో సోమవారం చింతామణిలో 98శాతం పోలింగ్ జరిగింది. చింతామణి పట్టణ, తాలూకా చేరి తహసీల్దార్ కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం మందగతిన పోలింగ్ సాగగా మధ్యాహ్నానికి పుంజుకుంది. 1054మంది ఓటర్లకు గాను 1028మంది ఓటు వేశారు. పోలీసు బందోబస్తు కల్పించారు.

బాగేపల్లిలో 96.01శాతం పోలింగ్

బాగేపల్లి: పరిషత్‌లోని ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా సాగినట్టు తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ తెలిపారు. 376మంది ఓటర్లకుగాను 361 మంది ఓటు వేయడంతో 96.01శాతం నమోదైనట్టు తెలిపారు. కాగా చేలూరులో 97శాతం పోలింగ్ నమోదైనట్టు తెలిపారు. 171మందికిగాను 168మంది ఓటు వేశారు. ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. బందోబస్తు చక్కగా కొనసాగిందని వివరించారు.



చింతామణిలో గుర్తింపు కార్డులతో ఓటర్లు



చింతామణిలో బందోబస్తు

హాయ్ అంటూ.. సిద్దూ, కుమార పలకరింపు

- మొహం తిప్పుకున్న డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకోసం అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయానికి వెళ్లిన సందర్భంలో సీఎం సిద్దరామయ్య, జేడీఎస్ నేత కుమారస్వామి ఎదురుపడ్డారు. సోమవారం ఉదయం కారిడార్‌లో ముఖ్యమంత్రి వేచి యుండగా నామినేషన్ ప్రక్రియ ముగించుకుని కుమారస్వామి గదినుంచి బయటకు వచ్చారు. ఎదురుగా కనిపించిన సిద్దరామయ్యను హాయ్ అంటూ కుమారస్వామి చేయి ఊపగా ముఖ్యమంత్రి కూడా హాయ్ అన్నారు. కుమారస్వామి వెంట ఉన్న జేడీఎస్ నేత జీటీ దేవేగౌడకు ముఖ్యమంత్రి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. కుమారుడిని అభ్యర్థి చేశావంటూ జీటీ దేవేగౌడ అడిగారు. అందుకు సీఎం సమాధానంగా ముందుగానే నిర్ణయించామన్నారు. జేటీ దేవేగౌడ భుజం తట్టి గడిచిన ఎన్నికల్లో నీ కుమారుడిని అభ్యర్థి చేయలేదా..? అంటూ ప్రశ్నించారు. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారు. జేడీఎస్ నేతలు ముఖ్యమంత్రికి షేక్ హ్యాండ్ ఇచ్చి ముందుకు కదిలారు. ఇదే చోటునే ఉన్న డీసీఎం డీకే శివకుమార్ మొహం తిప్పుకోవడంతో కుమారస్వామి ముందుకెళ్లిపోయారు. సీఎం సిద్దరామయ్య, జేడీఎస్ నేత కుమారస్వామిలు తరచూ రాజకీయ అంశాలతోపాటు వ్యక్తిగతంగాను తీవ్రంగానే విమర్శలు చేసుకుంటుంటారు. తాజాగా మండ్య లోక్‌సభ ఎన్నికలు, ఆ తర్వాత ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ వివాదంపై కుమారస్వామి, డీకే శివకుమార్‌ల మధ్య తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇదే తరుణంలో ఎదురుపడినా మాట్లాడకుండానే ముందుకు కదిలారు.



అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయం వద్ద సీఎంకు అభివాదం చేస్తున్న కుమారస్వామి

భక్తిశ్రద్ధలతో బౌద్ధ ధర్మదీక్ష స్వీకరణ

దొమ్మసంద్ర, జూన్ 3: ఆనేకల్ తాలూకాలోని సర్జాపురలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడామైదనంలో 2568 బౌద్ధపూర్ణిమను పురస్కరించుకుని ఆదివారం బౌద్ధధర్మ దీక్ష స్వీకరణ చేపట్టారు. దళిత, ప్రగతిపర సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. మైదానంలోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బంతేజిలు భగవాన్ బుద్ధుడు బోధించిన పంచశీల తత్వాలను బోధించారు. ధర్మమార్గాన్ని బోధించే పరిష్కారమే బౌద్ధధర్మ స్వీకార ఉద్దేశ్యంగా తెలిపారు. స్థానిక ప్రముఖులు సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ (బుడగప్ప), శ్రీరాములు గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు సతీశ్, రావణ, న్యాయవాది ఆనంద్ చక్రవర్తి, అత్తిబెలె ఫటాఫట్ నాగరాజ్, అడిగార్ కల్లహళ్ళి సీకే రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాలకు అడ్డుకట్ట




సీఐ ప్రశాంత్‌ను సత్కరిస్తున్న యువజన సంఘం సభ్యులు

బాగేపల్లి, జూన్ 3: ప్రజల సహకారంతోనే చట్టవ్యతిరేక కార్యకలాపాలు, నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు సులభం కానుందని బాగేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆర్ వర్ణి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ప్రసిద్ధ గడిదం లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవం, గంగమ్మదేవి కరగ మహోత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించడంపై పట్టణంలోని సమాన మనస్కుల యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయంగా సత్కరించారు. సన్మానం స్వీకరించి మాట్లాడుతూ ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠినచర్యలు తప్పవన్నారు. ఇటీవలికాలంలో యువత దుర్వ్యసనాలకు లోనుకావడం విచారకరమన్నారు. ప్రజలు కూడా శాంతి భద్రతలకు సహకారం అందించాలన్నారు. చట్టాలపై గౌరవం పెంచుకోవాలన్నారు. కొంతమంది నేరాలనుంచి తప్పించుకోవచ్చుననే భ్రమలో ఉన్నారని, అయితే సాధ్యం కాదన్నారు. ప్రతి వ్యక్తి కూడా తాను యూనిఫాం ధరించని పోలీసు అనే భావన ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకున్నట్టు గుర్తించి సమాచారం అందించేవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. కాగా ఇటీవల ప్రమాదాలు పెరిగాయని అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని మరికొంత మంది అవయవాలు కోల్పోతున్నారన్నారు. ఎక్కువ కేసుల్లో మద్యపానం చేసి వాహనాలు నడపడమే కారణమన్నారు. ఈ సందర్భంగా మడివాళ మాచిదేవ సంఘం అధ్యక్షుడు బీఎస్ సురేశ్, గ్రీన్‌ఇండియా ఫోరం అధ్యక్షుడు సయ్యద్ సిద్దిక్, సమాన మనస్కుల యువజన సంఘం ముఖ్యులు కదీర్‌ఖాన్, భాస్కర్, దర్శన్, నరేంద్ర బాబు, ఆనంద, శాహిద్, లతీఫ్, అబ్దుల్లా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగట్లో అంగన్‌వాడీ సరుకులు

పావగడ, జూన్ 3 : ప్రతినెలా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్ వాడీల ద్వారా అంద జేస్తున్న సరుకులు ప్రైవేట్ దుకాణాల్లో దొరుకుతున్నాయి. తాలూకా పరిధిలోని వైఎన్ హొసకోటలో సోమవా రం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతినెల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సరుకులను చెక్‌చేసి చిన్న పిల్లలకు పౌష్టికాహారం కొరత ఏర్పడకుం డా సకాలంలో అందజేయాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు వాటిని ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తుండటం దారుణమని సీడీపీఓ సునీత అన్నారు. అందిన సమాచారం మేరకు ఆమె సోమవారం వైఎన్ హొసకోట లోని ఓ ప్రావిజన్ స్టోర్‌లో తనిఖీలు చేశారు. ఆ దుకాణం లో అంగన్‌వా డీకి చెందిన పాలప్యాకెట్లు, ఇతర సిరిధాన్యాలు దొరికినట్లు సీడీపీఓ తెలిపా రు. దీనికి సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవడం తోపాటు ప్రైవేట్ దుకాణాలకు నోటీసులు అందిస్తామని తెలిపారు. అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని సీడీపీఓ హెచ్చరించారు.

బోరు అక్రమంపై అధికారుల తనిఖీలు



పరిశీలిస్తున్న అధికారులు

- బాధ్యులైన అధికారులపై చర్యలు
- రూ.1.90 లక్షల రికవరీకి సూచన

శిడ్లఘట్ట, జూన్ 3: దేవరాజ్ అరసు అభివృద్ధి మండలి నుంచి మంజూరైన బోరును తవ్వకనే కేవలం కేసింగ్ పైప్ వేసి నకిలీ రికార్డులతో బోరు వేసిన ఏజెన్సీ, జిల్లా కార్యాలయ సిబ్బదిపై క్రిమినేల్ కేసులు దాఖలు చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. తాలూకాలోని తిమ్మనాయకనహళ్ళి రైతు నారాయణస్వామికి దేవరాజ్ అరసు అభివృద్ధి మండలి నుంచి గంగా కల్యాణ పథకం కింద బోరుబావి మంజూరైంది. అయితే బోరు వేయకనే కేవలం కేసింగ్ పైప్ అమర్చి బోరు వేసినట్టుగా నకిలీ రికార్డులు సమర్పించడంతో రూ.1.90 లక్షలు సదరు బోర్‌వెల్ ఏజెన్సీ అధికారులు మంజూరు చేశారు. అయితే ఇందుకు సంబంధించి తిమ్మనాయకనహళ్ళి గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్పందించి కేంద్ర కార్యాలయ అధికారి భైరప్ప నేతృత్వంలో పరిశీలన చేశారు. తవ్వని బావికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధమైన బెస్కాంకు పలు సూచనలు చేశారు. బోరు గురించి సమగ్రంగా పరిశీలించకుండానే రైతుతో కుమ్మక్కు అయిన బోర్‌వెల్ ఏజెన్సీకి గ్రాంటు మంజూరు చేసిన అభివృద్ధి మండలి జిల్లా అధికారిపై క్రిమినల్ కేసులు దాఖలు చేయాలని నిర్ణయించారు. గ్రాంటు మొత్తాన్ని అధికారులనుంచి వాపసు పొంది ప్రభుత్వానికి జమచేసేలా చేయదలిచారు. కొంతమంది రైతుల తీరు, అధికారుల వల్ల ఇతరులకు చెడ్డపేరు వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో చేరితే...

వెయ్యి డిపాజిట్ ప్రకటించిన హెచ్‌ఎం

- కన్నడ పాఠశాల మనుగడకోసం ఓ యత్నం



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతాల్లో ప్రాంతీయ భాషల పాఠశాలల మనుగడ రానురాను కష్టమవుతోంది. బెంగళూరులో ఒకప్పుడు తెలుగు, తమిళ పాఠశాలలు ప్రతి ప్రాంతంలోనూ ఉండేవి. రానురాను వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. అయితే బెళగావి జిల్లా అథణి తాలూకా అడహళ్లట్టి హిప్పరగిలోని కన్నడ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతోంది. కర్ణాటక - మహారాష్ట్ర సరిహద్దున కల్గిన ప్రాంతం కావడంతో ఇక్కడ కన్నడ పాఠశాలలో చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది ఒకటో తర గతిలో కేవలం ఇద్దరు మాత్రమే విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది అదే పరిస్థితి కొనసాగితే పాఠశాల మనుగడకు కష్టమని భావించిన హెడ్మాస్టర్ సిద్దమల్ల ప్రత్యేక ఆఫర్ ప్రకటించారు. పాఠశాలలో ఒకటో తరగతిలో చేరితే వెయ్యి రూపాయలు డిపాజిట్ చేస్తానని హెడ్మాస్టర్ తెలిపారు. ఓ జాతీయబ్యాంకులో వెయ్యి రూపాయలు డిపాజిట్ చేస్తానని 18ఏళ్ల తర్వాత వారు వాపసు తీసుకోవచ్చునన్నారు. 2005లో పాఠశాల ప్రారంభించారు. 2015వరకు 1-7 తరగతుల దాకా 60-70మంది విద్యార్థులు ఉండేవారు. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడం, మౌలిక సదుపాయాలు కొరత వంటి సమస్యలతో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గత ఏడాది ఏడు తరగతులకు కలిపి కేవలం 18మంది మాత్రమే మిగిలారు. ఒకటో తరగతిలో చేరకపోతే వచ్చే ఏడాది నుంచి మరింత సమస్య ఏర్పడుతుందని హెచ్‌ఎం నిర్ణయించారు. 2023 జూలైలో ఇక్కడికి బదిలీపై వచ్చిన హెచ్‌ఎం సిద్దమల్ల పాఠశాలతో సంబంధం లేకుండా పిల్లలందరికీ క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఆఫర్‌తో తొలి రోజునే ఒకటో తరగతిలో 9మంది చేరారు.



హెచ్‌ఎం సిద్దమల్ల

ఏపీ ఫలితాలపై పావగడలో ఉత్కంఠ

పావగడ, జూన్ 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నిల్లో భాగంగా పావగడలో వైసీపీ, టీడీపీ అభిమానుల నడుమ తీవ్ర ఉత్కంఠం నెలకొంది. 20రోజుల నుంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న ఇరుపార్టీల అభిమానులు, కార్యకర్తలు ఓట్ల లెక్కింపు రోజులు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా రూ.లక్షల్లో బెట్టింగులు కాస్తున్న ట్లు సమాచారం. ప్రధానంగా పెనుకొండ, రాప్తాడు, పిఠాపురం నియోజకవ ర్గాల గెలుపుపై బెట్టింగ్‌లో జోరుసాగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కర్ణాటకలో ఎంపీ ఫలితాలు కూడా మంగళవారం వెలువడనుండటంతో ఇరుపార్టీల కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.